# ఆమె వెళ్లిపోయింది


పులిపాక కనకదుర్గ

కారు చీకటి నుంచి కాంతి రేఖల దిశగా ఆమె వెళ్లిపోయింది.

తరతరాల పురుషాధిక్యతను నిరసిస్తూ, ధిక్కరిస్తూ ఆమె వెళ్లిపోయింది.

చిక్కటి చీకటిలో నేను మిగిలిపోయేను. నిరాశగా, నిస్తేజంగా

నా హృదయ ఘోషను తనలో కలుపుకోవడానికా అన్నట్లు సముద్రం కూడా ఒకటే ఘోష.



మరి కొద్దిసేపట్లో నూతన సంవత్సరం ప్రారంభం కావడానికి సూచనగా దూరంగా కేకలు, ఉల్లాసభరితమైన అరుపులు వినిపిస్తున్నాయి.

నేను కూడా అంతకంటే ఎక్కువ ఉత్సాహంగా, ఉద్వేగంగా కొత్త సంవత్సరాన్ని, ఆహ్వానించేవాడిని. ఆమె నా ప్రేమను అంగీకరించి వుంటే...

***

రచన బ్రహ్మ కుంచె నుంచి జాలువారిన ఓ అద్భుతమయిన సౌందర్యం.

తనని మొదటిసారి చూసింది మా ఆఫీసులోనే...

"సర్, జాయినింగ్ రిపోర్టు ఇవ్వడానికి కొత్తగా రిక్రూట్ అయిన కంప్యూటర్ ఇంజనీర్ మిమ్మల్ని కలవడానికి వచ్చారు. పిలవమంటారా?" రిసెప్షనిస్టు స్టెల్లా అడిగింది ఫోన్‌లో

"కొత్తగా రిక్రూట్‌మెంట్ అంటే ఐఐటి క్యాంపస్ సెలెక్షనే కదూ"

"ఎస్ సర్"

"అయిదు నిమిషాల తరువాత పంపించండి." ఫోన్ పెట్టేసాను.

ఆ క్షణాన నాకు తెలియలేదు. ఓ అద్భుత సౌందర్యం నా అపాయింట్‌మెంట్ కోసం నిరీక్షిస్తోందని.

సరిగ్గా అయిదు నిమిషాల తరువాత తను లోపలకి వచ్చింది. స్ప్రింగ్ డోర్ తీసుకొని లోపలకి వస్తున్న తనని చూస్తుంటే మెరుపు తీగకు ప్రాణం వచ్చినట్టనిపించింది.

ఆల్మండ్ షేపులోని అందమైన కళ్లని చూసి ఒక్క క్షణం నన్ను నేను మరిచిపోయేను. ఎర్రని చిన్ని పెదాలు, తళుక్కుమంటున్న ముత్యాల పలువరుస నన్ను ఊరించటానికే వున్నాయేమో అనిపించింది. పచ్చి పాలల్లో గులాబీరేకులను రంగరించినట్టున్న మేనిఛాయతో... లేత గులాబీరంగు చుడిదార్లో... అర విరిసిన తాజా గులాబీలా... నడిచే వీనస్ శిల్పంలా వుందామె.

బయోడేటా చూసేను. బ్రిలియంట్ ఎకడమిక్ కెరీర్

అమెరికన్ బేస్డ్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో టీం లీడర్ని నేను. ఐఐటి, బిటెక్, ఐఐఎం ఎంబిఎ, ఫారిన్‌లో చేసిన ఎంఎస్. పెద్ద మల్టీనేషనల్ కంపెనీలో సాలుకు యాభైలక్షల శాలరీతో బాస్ హోదా, ఇరవై అయిదేళ్ల వయసు వెరసి నేను.

'లవ్ ఎట్ ఫస్ట్ సైట్' అంటే నాకు తెలియదు.

రచనని చూసిన మొదటి క్షణమే నేనామెని ప్రేమించానన్నది వాస్తవం. ప్రేమ ఎప్పుడు, ఎందుకు పుడుతుందో ఎవరూ చెప్పలేరు. నా బ్రహ్మచర్యం అంటే విరక్తి కలిగి రక్తి కలిగేలా చేసింది ఆమె. నాలోని మగాడ్ని నిద్ర లేపింది ఆమె.

రోజులు గడుస్తున్న కొద్దీ ఆమె మీద ప్రేమ అధికమయిందే కానీ తగ్గలేదు. ఆమె సమక్షం వెన్నెల కోన. ఆమె నవ్వు మల్లెల వాన. ఎంత సమీపంలో వున్నా ప్రేమ విషయం తనతో కదల్చాలంటే జంకు.

మరో వైపు పెళ్లి చేసుకొమ్మని ఇంట్లో ఒకటే పోరు. ఓ రోజయితే ముందుగా చెప్పాపెట్టకుండా అన్నయ్య, వదిన ముంబాయి వచ్చేశారు.

"ఏమయ్యా అరుణ్! పెళ్లి చేసుకునే ఆలోచనేమయినా వుందా లేదా?" పరిహాసానికి అన్నట్టుగా అంది వదిన.

ఈ విషయం అడగడానికి పనిగట్టుకుని ఇంత దూరం ఎందుకు వచ్చారో నాకు అస్సలు అర్థం కాలేదు. 'ఇప్పటికే అమ్మ పోరుతోనే సతమతమవుతున్నాను మళ్లీ ఇదొకటా?'

నా అయోమయాన్ని గమనించాడేమో అన్నయ్య అసలు విషయంలోకి వచ్చేడు. "చూడు అరుణ్ అమ్మా నాన్న నీ పెళ్లి గురించి ఎంత వర్రీ అవుతున్నారో నీకు పూర్తిగా తెలీదు. నువ్వు మాత్రం ఎంత కాలమని ఇలా ఒంటరిగా వుంటావు? జీవితంలో స్థిరత్వం అన్నది పెళ్లితోనే సాధ్యం. పైగా అమ్మా నాన్నలని సంతోషపెట్టాల్సిన బాధ్యత కూడా నీకుంది"

అన్నయ్య అవస్థ గమనించి వదిన అందుకుంది. "మీ అన్నయ్య చెప్పడానికి ఇబ్బంది పడుతున్నారు కానీ మేమొచ్చింది మా పిన్ని కూతుర్ని నీకు అడగడానికి. తను కూడా ఇంజనీరింగ్ పూర్తి చేసింది. అమ్మాయి చక్కగా వుంటుంది. నీకు సెలవు దొరకడం ఇబ్బంది అయితే వాళ్లనే ఇక్కడకు పిలిపిస్తాను"

ఎన్ని కుంటి సాకులు చెప్పి వాళ్లని పంపించేనో భగవంతుడికే ఎరుక.

రచనతో నా ప్రేమ విషయం ఎలా కదల్చాలో అర్థం కావడం లేదు. "ఎంత కాలమని ఈ సౌందర్య జ్వాలలో దహించుకుపోను?"

***

"ఏమంటోంది నీ వీనస్?"

"ఏమయినా వుంటే కదా తను అడగడానికి"

సూరజ్ నా వంక ఆశ్చర్యంగా చూసేడు.

"అదేమిటి? నువ్వేం చెప్పలేదా?

"లేదు"

"ఇన్ని నెలల నుంచి తననంత దగ్గరగా వుంచుకొని కూడా ఏం చెప్పలేదా" నమ్మలేనట్టుగా అడిగేడు.

"అరె బాబా ఎలా చెప్పాలో తెలియక చెప్పలేదు"

పెద్దగా నవ్వేడు సూరజ్

"ప్రేమించడానికి లేని మొహమాటం ఆ ప్రేమని వెల్లడి చేయడానికి ఎందుకు? ఏదో ఒక అకేషన్ క్రియేట్ చేసుకొని చెప్పు"

అదిగో అప్పటి నుంచి మొదలయ్యేయి నా తిప్పలు

మొదలు తనకు ఫోన్ చేసి చెప్దామనుకున్నాను.

కానీ అంతటి అపురూపమయిన విషయాన్ని అలా క్యాజువల్‌గా చెప్పలేకపోయేను.

గ్రీటింగ్ కార్డు!

ఐడియా బాగానే వుంది కానీ నా ప్రేమకు అక్షరరూపం అంత సులువు కాదనిపించింది. ఎన్ని రోజులు ఆలోచించేనో నాకే తెలుసు

అనుకోని విధంగా ఓ అవకాశం వచ్చింది.

స్టెల్లా బర్త్‌డేకి ఆఫీసులో అందర్నీ ఇన్‌వైట్ చేసింది. ఫంక్షన్ అయిపోవస్తుండగా స్టెల్లా నా దగ్గరకి వచ్చి రిక్వెస్ట్ చేసింది "సర్ రచన మేడం ఒక్కరే వచ్చారు. ఇప్పుడేమో బాగా రాత్రయింది. తనను వాళ్ల ఇంటి దగర డ్రాప్ చేస్తారా?"

మనసులోనే ఎగిరిగంతేశాను.

పదకొండు దాటడంతో ట్రాఫిక్ రద్దీ చాలా తక్కువగా వుంది. నా సంతోషాన్ని పంచుకోవడానికా అన్నట్లు జల్లు మొదలయ్యింది.

నా పక్కనే రచన మెత్తటి స్పర్శ నన్ను వివశుడ్ని చేస్తోంది.

జరీవర్కు చేసిన పసుపు రంగు ప్యూర్ సిల్కు శారీ, పొట్టిచేతుల బ్లౌజ్, మెడలో, చెవులకు అమెరికన్ డైమండ్స్‌తో చేసిన సింపుల్ జ్యూయలరీతో సన్నగా నాజుకుగా లైట్ల వెలుతురులో పాలరాతి శిల్పంలా మెరిసిపోతోంది రచన.

నా ప్రేమని వెల్లడి చేయమని మారాం చేస్తున్న మనసుని కష్టం మీద బుజ్జగించేను.


అవకాశం దొరికింది కదాని సమయం, సందర్భం చూడకుండా చెప్పేస్తే ఆకతాయితనం అనుకోదూ!

ఆర్నెల్ల నా నిరీక్షణ ఫలించి నాకు అనువయిన అవకాశం మరికొద్దిరోజులకే వచ్చింది.

***

జుహుబీచ్ ఎక్కడ చూసినా కోలాహలంగా వుంది.






దగ్గరలో వున్న రిసార్టులో స్టాఫంతా కొత్త సంవత్సరపు వేడుకల్లో మునిగిపోయివున్నారు. పాత సంవత్సరంతో పాటు నా విరహానికి వీడ్కోలు పలికి కొత్త సంవత్సరంతో పాటు రచనను నా జీవితంలోకి స్వాగతించడానికి అపూర్వమైన సందర్భం.

ఏకాంతం కోసమని జన సంచారానికి దూరంగా అనువయిన ప్రదేశాన్ని ఎంచుకున్నాను.

మరికొద్దిసేపట్లో రచన ఇక్కడకు రాబోతోందన్న ఆలోచనే ఎంతో ఉద్విగ్నభరితంగా అనిపించింది. న్యూ ఇయర్ పార్టీకి వచ్చిన రచనను పర్సనల్‌గా మాట్లాడాలని అడిగేను. మొదట కొద్దిగా ఆశ్చర్యపోయినా ఏమనుకుందో ఒప్పుకుంది.

తనకోసమే ఇక్కడ అరగంట నుంచి వెయిటింగ్

దూరంగా రచన రాకను గమనించడంతో హృదయ స్పందన పెరిగింది.

స్మైలింగ్ ఫేస్‌తో పక్కన కాస్త ఎడంగా వచ్చి కూర్చుంది.

ఎలా మొదలుపెట్టాలో, ఏం చెప్పాలో తెలియని అయోమయం.

కాసేపు ఆఫీసు విషయాలు, మరి కాసేపు ఇంటి గురించి మాట్లాడేను. అదంతా అసందర్భంగా వుందని అర్థమవుతూనే వుంది.

'మైగాడ్ ప్రేమ కఠినమైన పరీక్షే!'

ఎట్టకేలకు నా హృదయాన్ని ఆమె ముందు పరిచేను. ఇన్ని నెలల ఆర్తి, ఆరాధనా ఆమెతో పంచుకున్నాను. ప్రేమ నివేదన అత్యంత శ్రద్ధగా చేసేను.

నిర్మలంగా అంతా విన్నది రచన.

"అరుణ్! ప్రేమ విశ్వజనీనమయినది. కానీ అది ఇరు హృదయాలలోనూ ఒకే విధమైన స్పందనలు కలుగచేయాలి. అప్పుడే అది ఫలవంతమవుతుంది. నాకెందుకో మీ ప్రేమ కేవలం బాహ్య సౌందర్యం పట్ల కాంక్షగా మాత్రమే అనిపిస్తోంది. అరుణ్, బ్యూటీ ఈజ్ స్కిన్ డీప్. ఈ అందం కొంతకాలం తరువాత నన్ను వీడిపోవచ్చు. నన్ను మించిన సౌందర్యం మీకు తారసపవచ్చు. అప్పుడు నా పరిస్థితి ఏమిటి?"

షాక్ నుండి తేరుకోవడానికి కొద్ది క్షణాలుపట్టింది.

అడిగిందే తడవుగా అంగీకరిస్తుందనుకున్నాను. కానీ ఇలా నా ప్రేమను సవాలు చేస్తుందనుకోలేదు.

"రచనా ఎందుకు నీకు నా ప్రేమపై సందేహం కలిగింది."

"చెప్పేనుగా ప్రేమ విశ్వజనీనమని. ప్రేమించే హృదయం మీకుండడం నిజమయితే అది నన్ను మాత్రమే ప్రేమించదు. అరుణ్ ఎంతో కొంత ప్రేమను సాటివారికి కూడా పంచుతుంది."

"వాడ్డూయూ మీన్?" అసహనంగా అడిగేను.

"ఓకే అరుణ్! వారం రోజుల క్రితం మీరు ఆఫీసుకు వస్తున్నప్పుడు ఏం జరిగిందో గుర్తుందా?" మృదువుగా అడిగింది.

ఏం జరిగిందో ఎంత ప్రయత్నించినా గుర్తుకు రాలేదు.

"అది గుర్తు పెట్టుకోవాల్సిన పెద్ద విషయంగా మీకు అనిపించకపోవచ్చు. నా కలా కాదు. మీ వెనకాలే కారులో నేనూ, స్టెల్లా వస్తున్నాము. ఓ చిన్నపాపకు యాక్సిడెంటు అయి కిందపడింది. అందరిలాగే మీరు కూడా ఓ నిమిషం కారాపి చూసి వెళ్లిపోయారు. వర్రీ అవకండి. ఆ పాపను నేనూ, స్టెల్లా హాస్పిటల్‌కి తీసుకెళ్లాము. షీ ఈజ్ అవుటాఫ్ డేంజర్. అరుణ్ మీకు తెలియదు. ఈ జీవితం నాకు ఓ మానవతా మూర్తి పెట్టిన భిక్ష. చిన్నతనంలో నాకూ అలానే జరిగితే ఓ ప్రేమమూర్తి సమయానికి హాస్పిటల్‌లో చేర్పించడం వల్ల సేవ్ అయ్యాను. ఇప్పటికీ దేవుడితో పాటు ఆయన ఫోటోకు కూడా నమస్కరిస్తాను.

"..............."

"అరుణ్ అందరూ సంకుచితంగా ఆలోచిస్తే ఓ రోజు ఆపదలో మనకు కావలసిన వారు వుండొచ్చు. అప్పుడు వారి పరిస్థితి ఏమిటి? ఇప్పుడు మీ ప్రేమను అంగీకరిస్తే నాకు ప్రాణ భిక్ష పెట్టిన ప్రేమ మూర్తిని అవమానించినట్లు కాదా? అయినా ప్రేమంటే మనకు కావల్సినదాన్ని, నచ్చినదాన్ని ఎంచుకోవడం కాదు జీవితం దేవుడు ఇచ్చిన అవకాశం. ఎంతసేపూ నా కెరీర్, నా డెవలప్‌మెంట్ అంటూ స్వార్థపూరితంగా నేనుండలేను. ఈ విషయంలో మనిద్దరికి పొసగదు. ప్రేమ విషయంలో ఇంతటితో మరిచిపొండి."

ఆఫీసులో స్వీపరుకు రక్తం కావలసి వస్తే ఒక రోజంతా సెలవు పెట్టిన రచన, పుట్టిన రోజున అనాథ బాలలకు స్వీట్లు పంచే రచన, ఎప్పుడయినా టిఫిన్ తెచ్చుకోకపోతే తన బాక్స్‌ను షేర్ చేసుకునే రచన ఇప్పుడు ఎవరి కోసం వారు జీవించడం కాదు బాధల్లో వున్నవారికి కాసింత చేయూతనివ్వాలని నేనెప్పుడు ఆలోచించని కొత్త పార్శ్వాన్ని ఆవిష్కరించింది రచన.

వేయింతల మానసిక సౌందర్యంతో ప్రకాశిస్తూన్న ఆ తేజోపుంజాన్ని చూసి అర్థమయింది నేనెంత అంధకారంలో వున్నది. ఆమె మీదున్న ప్రేమ మరింత పెరిగింది.

'కావచ్చు, కానీ నా ప్రేమ నిజమయింది.' ఆమెతో చెప్పేను.

వెన్నెలంత చల్లగా నవ్వింది. "మీది సిన్సియర్ లవ్ అయితే నా ఇష్టా ఇష్టాల గురించి బాగా తెలుసుండాలే? కనీసం నాకిష్టమైన కలర్ ఏదో చెప్పండి"

ప్రేమించడానికి, స్వార్థానికి వ్యత్యాసం తెలిసిన క్షణమది. జీవితంలో సమాధానం చెప్పలేకపోయిన మొదటి ప్రశ్న అది. కొన్ని వన్‌సైడ్ లవ్‌లు ఎందుకు విఫలమవుతాయో తెలిసిన క్షణమది.

వెళ్లడానికి ఉద్యుక్తురాలవుతున్న ఆమెతో ఆఖరి యత్నంగా అర్థించేను "కనీసం నా పెళ్లి ప్రతిపాదనను అంగీకరించవచ్చు కదా!"

ఆమె తన ప్రయత్నాన్ని విరమించుకొని అంది "ఎందుకంత మనోదౌర్బల్యం అరుణ్? ప్రేమను అర్థించి గానీ, దౌర్జన్యంతో గానీ పొందలేరు. ఒక్క క్షణం ఆలోచించండి. మీకు ఇష్టం లేని అమ్మాయిని మీరు పెళ్లాడగలరా? జీవితంలో ప్రేమ ఒక భాగం మాత్రమే. ఈ విషయాన్ని ఇంతటితో మరిచిపోదాం. నా పట్ల నా నిర్ణయాధికారాన్ని, నా ఇష్టా ఇష్టాలను మీరు గౌరవించాలి.

"నా ప్రేమ స్వార్థం అన్నారు సరే పెళ్లేందుకు కాదంటున్నారో తెలుసుకోవచ్చా?"

ఒక్క క్షణం తటపటాయించి మృదువుగా చెప్పింది. "మీ ఫ్రెండ్ సూరజ్ మీ దగ్గరకొచ్చి తన ఫ్యామిలీ ప్రాబ్లమ్స్ మీతో చెప్పుకున్నాడు. మీరు ఆరోజు అతనితో అన్న మాటలకు నేను మనసులో ఎంతగానో నొచ్చుకున్నాను. తప్పు అతనిదే అయినా మీరేమన్నారో గుర్తుందా? భర్తతో విభేదిస్తే నష్టపోయేది భార్యేనని... ఆ నిజం ఎరిగి మసులుకొమ్మని మీ మాటగా ఆమెతో చెప్పమని చెప్పేరు. ఆ క్షణం అత్యవసరమైన పనిమీద మీ ల్యాప్ టాప్ మీద పనిచేసుకుంటున్న నేను తప్పనిసరై అక్కడ వుండాల్సి వచ్చింది. భార్యని సెకెండ్‌రేట్ సిటిజెన్‌గా ట్రీట్ చేసే వ్యక్తితో నేను జీవితం పంచుకోలేను. నాకు కాబోయే భర్త ఓ మంచి స్నేహితుడిగా వుండగలగాలి.

ఆమె మానసిక సౌందర్యం ముందు, స్వాభిమానం ముందు నేను కుంచించుకుపోయి అణువంతయి, నలుసయి, ఆపైన ఉనికిని కోల్పోయాను.

విన్రమంగా సెలవు తీసుకొని ఆమె నిష్క్రమించింది.

తనకేం కావాలో, ఎలా సాధించుకోవాలో స్పష్టంగా తెలిసిన ఆధునిక యువతి రచన

సుతిమెత్తగా నా ప్రేమను తిరస్కరించి ఆమె వెళ్లిపోయింది.

కారు చీకటి నుంచి కాంతి రేఖల దిశగా ఆమె వెళ్లిపోయింది.

తరతరాల పురుషాధిక్యతను నిరసిస్తూ, ధిక్కరిస్తూ ఆమె వెళ్లిపోయింది.

★